మధ్యాహ్న భోజనం నిధులు విడుదల

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 24 : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. ఆగస్టు వరకు బిల్లులను విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. వంట కార్మికుల గౌరవ వేతనం కూడా మంజూరు చేసింది. 1 నుంచి 8వ తరగతి వరకు విద్యార్థుల భోజన ఖర్చులు రూ.90,40,012, కోడిగుడ్ల కోసం అదనంగా రూ.58,36,200 విడుదల చేసింది. జిల్లాలో 1,218 పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం అందించడానికి 1,850 మంది వంట కార్మికులు ఉన్నారు.



మెదక్ పాత బస్టాండ్ వద్ద పైప్‌లైన్ మరమ్మతు కోసం తవ్విన రోడ్డు

రోడ్డుకు లీకేజీల గండం

- మెదక్ పట్టణంలో మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు తరచూ లీకేజీలు
- మరమ్మతుల కోసం రోడ్లను తవ్వడంతో ట్రాఫిక్ తిప్పలు

మెదక్ మున్సిపాలిటీ, సెప్టెంబరు 22: మెదక్ జిల్లాకేంద్రంలో ప్రధాన రహదారి తరచూ తవ్వకాలతో గుల్లవుతున్నది. రెండు దశాబ్దాల ఎదురుచూపుల అనంతరం నిర్మించిన రోడ్డు.. మిషన్‌భగీరథ పైపులైన్ల పుణ్యమా అని గుంతలమయంగా మారుతున్నది. రూ.50 కోట్లతో నిర్మించిన రోడ్డు ఎక్కడికక్కడే ధ్వంసమవుతోంది. పట్టణంలో నీటి సరఫరా కోసం ప్రధాన పైప్‌లైన్‌ను ఈ రహదారి కింద నుంచే పైపులైన్‌ను నిర్మాంచారు. కానీ తరచూ లీకేజీల కారణంగా మరమ్మతుల రోడ్డును తవ్వాల్సి వస్తున్నది. ఇప్పటికే ప్రధాన రహదారిని లెక్కలేనన్నిసార్లు తవ్వి.. బీటీ స్థానంలో సీసీప్యాచ్‌లు వేశారు. తాజాగా పాత బస్టాండ్ మీదుగా నర్సిఖేడ్ వెళ్లే మార్గంలో పైపులైన్ మరమ్మతు కోసం మున్సిపల్ సిబ్బంది రోడ్డును తవ్వేయడంతో ట్రాఫిక్‌కు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. మిషన్‌భగీరథ, మున్సిపల్‌శాఖ సమన్వయం లోపంతో రోడ్డును ధ్వంసం చేస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వెంకటరమణ కాలనీలో
పారిశుధ్య పనులు

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందించిన అధికారులు



వెంకటరమణ కాలనీలో నిల్వ ఉన్న నీటిలో ఆయిల్‌బాల్స్ వేస్తున్నమున్సిపల్ సిబ్బంది

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

జహీరాబాద్, సెప్టెంబరు 24 : జ్వరాలతో మంచం పట్టిన వెంకటరమణకాలనీలో మున్సిపల్ అధికారులు పారిశుధ్య పనులను చేపట్టారు. వైద్యశాఖ సిబ్బంది జ్వర బాధితులకు మందులు అందజేశారు. 'జహీరాబాద్‌కు జ్వరాల భయం' అనే శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో ఈ నెల 22న ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. మున్సిపల్, వైద్యవిభాగానికి చెందిన అధికారులు కాలనీలో మంగళవారం పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. ప్రతీ ఇంటిని సందర్శించి జ్వర బాధితుల వివరాలను తెలుసుకున్నారు. అవసరమైన మందులను పంపిణీ చేశారు. మురుగునీటి కాల్వల్లో ఆయిల్‌బాల్స్ వేశారు. వీధుల్లో బ్లీచింగ్‌పౌడర్ చల్లారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సంధ్యాకుమారి, సిబ్బది రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

వానాకాలం సీజనల్ జ్వరాలు వ్యాపించే అవకాశం ఉండడంతో వైద్యసిబ్బంది అప్రమత్తంగాలని జిల్లా ప్రాంతీయ ఆస్పత్రుల పర్యవేక్షణాధికారి డాక్టర్ సంగారెడ్డి పేర్కొన్నారు. జహీరాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. వివిధ విభాగాలకు చెందిన రికార్డులను పరిశీలించారు. ఆస్పత్రిలో సౌకర్యాలు, మందుల నిల్వలు, రోగులకు అందుతున్న సేవలపై సూపరింటెండెంట్ డా.శ్రీదర్‌ను అడిగి తెలుసుకున్నారు. కేటాయించిన విధులను వారు సక్రమంగా నిర్వహించాలని, నిర్లక్ష్యం చేస్తే ఉపేక్షించబోమని హెచ్చరించారు.



నల్లచెరువు-మాసానికుంట కాలువను పూడ్చి ఇరువైపులా చేపట్టిన నిర్మాణాలు

వరద కాల్వను మింగేశారు..

- కాలువను పూడ్చి నిర్మాణాలు
- అపార్ట్‌మెంట్లు, ఇళ్ల నిర్మాణం
- అడ్డగోలుగా అనుమతులు
- పట్టించుకోని నీటిపారుదలశాఖ

ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలతో కనుమరుగైన నల్ల చెరువు-మాసానికుంట వరద కాలువ

సంగారెడ్డి టౌన్, సెప్టెంబరు 24: జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలోని చెరువులు, కుంటలతో పాటు వరద కాలువలు కనుమరుగవుతున్నాయి. ఒక చెరువు నుంచి మరో చెరువుకు అనుసంధానంగా ఉన్న నాలాలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. కాల్వలపైనే బహుళ అంతస్థులను నిర్మిస్తున్నారు. గతంలో విశాలంగా ఉన్న నాలాలు నేడు కుచించుకుపోయి మురికికాలువలను తలపిస్తున్నాయి.

ఓవైపు హైదరాబాద్ జీహెచ్‌ఎంసీ పరిధిలోని బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్, సర్కారు భూముల్లో అక్రమ నిర్మాణాలను హైడ్రా అధికారులు కూల్చివేస్తుంటే సంగారెడ్డి పట్టణంలో రియల్టర్లు నాలాలను సైతం చెరబట్టి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. ఈ అక్రమ నిర్మాణాలను అరికట్టాల్సిన నీటి పారుదల శాఖ, మునిసిపల్ అధికారులు చోద్యం చూస్తున్నారనే విమర్శలొస్తున్నాయి.

రెండు కిలోమీటర్ల కాలువ

జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని పోతిరెడ్డిపల్లి శివారులో ఉన్న నల్ల చెరువు నుంచి హౌజింగ్ బోర్డులోని మాసానికుంట మధ్య ఉన్న వరద కాలువ కనుమరుగవుతున్నది. దాదాపు రెండు కిలోమీటర్ల మేర ఉన్న ఈ వరద కాలువకు ఇరువైపులా అక్రమ నిర్మాణాలు చేపట్టారు. సంగారెడ్డి-నాందేడ్, అకోలా 161 జాతీయ రహదారి పక్కనే ఉన్న నాలాను పూర్తిగా పూడ్చేసి అక్రమ నిర్మాణాలు చేపట్టారు. గతంలో నీటి పారుదలశాఖ అధికారులు సర్వే చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. నల్ల చెరువు మత్తడి నుంచి దిగువన ఉన్న కాకతీయనగర్, ఆదర్శనగర్‌తో పాటు మాసానికుంట ఎగువన ఉన్న హౌసింగ్ బోర్డు, కేతకీ సంగమేశ్వరనగర్ తదితర కాలనీలలో ఈ వరద కాలువకు ఇరువైపుల బహుళ అంతస్థుల అపార్టుమెంట్లను నిర్మించారు. పోతిరెడ్డిపల్లి చౌరస్తాలోని బస్టాప్ సమీపంలో నాలాను ఓ హోటల్ యజమాని పూర్తిగా పూడ్చివేశారు. ఈ వరద కాలువకు ఇరువైపుల అక్రమ నిర్మాణాలు చేపట్టడంతో కాలువ కుచించుకుపోయి మురికి కాలువలా మారింది.

అడ్డగోలుగా అనుమతులు

నల్ల చెరువు నుంచి మాసాని కుంట మధ్యలో ఉన్న వరద కాలువకు ఇరువైపులా నిర్మించిన అపార్టుమెంట్లకు మునిసిపల్ అధికారులు అడ్డదారుల్లో అడ్డగోలుగా అనుమతులిచ్చారనే ఆరోపణలున్నాయి. 2018లో పోతిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ సంగారెడ్డి మునిసిపాలిటీలో విలీనమైన అనంతరం కూడా పాత తేదీలతో అనుమతులిచ్చినట్లు ఆరోపణలున్నాయి. ఇందులో కొన్ని భవనాలు నిబంధనలకు విరుద్ధంగా నిర్మించినట్లుగా గుర్తించిన మునిసిపల్ అధికారులు.. నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకున్నారు. నల్ల చెరువు-మాసానికుంట మధ్యలో ఆక్రమణకుగురైన వరద కాలువను గుర్తించి అక్రమనిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



నల్ల చెరువు దిగువన కాలువను పూడ్చి నిర్మిస్తున్న భవనం



హౌసింగ్ బోర్డు కాలనీలో ఆక్రమణలతో కుంచించుకుపోయిన నాలా

నియమాలు పాటిస్తే ప్రమాదాలకు చెక్

రోడ్డు భద్రతా సమావేశంలో మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, సెప్టెంబరు 24: రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తూ ప్రమాదాలను నివారించాలని జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో ఆర్‌అండ్‌బీ, నేషనల్ హైవే, పోలీసు, రవాణా, మున్సిపల్ సంబంధిత శాఖలతో మంగళవారం ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి రోడ్డు భద్రతా సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ద్విచక్ర వాహనాలు, లైట్ మోటార్ వెహికిల్స్ మూలంగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగం తప్పనిసరి అన్నారు. అధికారులు జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదల నిర్వహణకు సూచికబోర్డులు, మలుపుల దగ్గర హెచ్చరికల బోర్డులు, స్పీడ్‌లిమిట్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ప్రమాదాల్లో గాయపడినవారికి తక్షణ వైద్యం కోసం 108 సేవలు అందుబాటులో ఉంచాలన్నారు. ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రమాదాల నివారణకు జిల్లా పోలీసు యంత్రాంగం నిరంతరం పని చేస్తుందన్నారు. వాహన తనిఖీ చేసి జరిమానాలు విధిస్తూ వాహనదారులకు తగు సూచనలు చేస్తున్నామన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. సమావేశంలో వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

చెరువుల ఉమ్మడి సర్వే వేగవంతం

- ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌ల గుర్తింపు కోసం..
- ఉమ్మడి తూప్రాన్ మండల పరిధిలో 243 చెరువులు, 45 చెరువుల్లో సర్వే పూర్తి

తూప్రాన్, సెప్టెంబరు 24: చెరువులు, కబ్జాలు జరుగుతున్న నేపథ్యంలో గుర్తించేందుకు అధికార యంత్రాంగం విస్తృతంగా చర్యలు చేపట్టింది. హెచ్‌ఎండీఏ పరిధిలో చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లను గుర్తించి నోటిఫికేషన్ జారీచేసేందుకు కసరత్తు చేపట్టింది. ఔటర్‌రింగ్ రోడ్డు పరిధిలో హైడ్రా అక్రమణలపై ఉక్కుపాద మోపుతుండగా హెచ్‌ఎండీఏ పరిధిలో చర్యలు తీసుకోడానికి సిద్ధమవుతున్నారు. తూప్రాన్, మనోహరాబాద్ మండలాల్లో హెచ్‌ఎండీఏ పరిధిలో 243 చెరువులు ఉన్నాయి. తూప్రాన్ మండలంలో 138 చెరువులకు 93 చెరువులు, మనోహరాబాద్ మండలంలో 105 చెరువులకు 77 చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌ల పరిధి గుర్తిస్తూ గతంలో ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేశారు. చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లకు హెచ్‌ఎండీఏ తుది నోటిఫికేషన్ జారీచేసేందుకు కసరత్తు చేస్తున్నారు. చెరువుల మ్యాపుల ఆధారంగా ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పరిధిలోకి వచ్చే పట్టాదారుల వివరాలను రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు నమోదు చేస్తున్నారు. తూప్రాన్ మండలంలో 23 చెరువులు, మనోహరాబాద్ మండలంలో 22 చెరువుల సర్వేలు పూర్తిచేశారు. ఉమ్మడి తూప్రాన్ మండలంలో ఈ సర్వేను మంగళవారం తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి పరిశీలించారు. ఏలాంటి పొరపాట్లు జరుగకుండా సర్వే చేయాలని సిబ్బందికి సూచించారు.



తూప్రాన్‌లో చెరువు నక్షాను పరిశీలిస్తున్న ఆర్డీవో



ఏడుపాయల ఆలయం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న మంజీరా నది

మళ్లీ పెరిగిన మంజీరా ఉధృతి

జలదిగ్బంధంలో ఏడుపాయల వనదుర్గా ఆలయం

పాపన్నపేట, సెప్టెంబరు 24: ఏడుపాయల వనదుర్గామాత ఆలయం వద్ద మంజీరానది ఉధృతంగా ప్రవహిస్తున్నది. సింగూరు ప్రాజెక్టు నుంచి నీటిని వదలడంతో ఘనపురం వనదుర్గా ప్రాజెక్టు పొంగిపొర్లుతున్నది. అమ్మవారి ఆలయానికి వెళ్లే రహదారి పైనుంచి మంజీరానది పారుతున్నది. దీంతో, అధికారులు ఆలయాన్ని మూసివేసి దుర్గామాత ఉత్సవ విగ్రహాన్ని రాజగోపురంలో ఉంచి పూజలు నిర్వహిస్తున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు సింగూరు ప్రాజెక్టు నిండి ఒక గేటును ఎత్తి మంజీరా నీటిని కిందికి వదిలారు. 8 వేల క్యూసెక్కుల నీరు వనదుర్గా ప్రాజెక్టు నుంచి ఏడుపాయల ఆలయం ముందుగా ప్రవహిస్తోంది.

చలికాలంలో విద్యార్థులు ఇబ్బంది పడొద్దు

గురుకులాలు, వసతిగృహాల్లో ఏర్పాట్లు సిద్ధం చేయాలి

అధికారులకు సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశం

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 24 : గురుకుల పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థులు చలికాలంలో ఇబ్బందులు ఎదుర్కొనకుండా అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశించారు. సంగారెడ్డిలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మంగళవారం అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. గురుకుల పాఠశాలలు, వసతిగృహాల విద్యార్థులకు అవసరమైన దుప్పట్లు, రగ్గులు, ఇతర వస్తువుల ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. సంక్షేమ వసతిగృహాల్లో మెరుగైన సదుపాయాలను కల్పించేందుకు అవసరమయ్యేందుకు ప్రతిపాదనలు పాఠశాలలవారీగా పంపాలని అధికారులకు సూచించారు. విద్యార్థులకు మెరుగైన విద్యతోపాటు మెనూ ప్రకారం నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించాలని, సకాలంలో కాస్మోటిక్ చార్జీలు చెల్లించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీఈవో వెంకటేశ్వర్లు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి

ఎంబీబీఎస్ ఫస్టియర్‌లో
98.66 శాతం ఉత్తీర్ణత నమోదు

సంగారెడ్డి ప్రభుత్వ మెడికల్ కళాశాల విద్యార్థులకు ప్రిన్సిపాల్ అభినందన

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 24 : సంగారెడ్డిలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల ఎంబీబీఎస్ ఫస్టియర్ ఫలితాలు విడుదలయ్యాయి. ఈ మేరకు కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్(కేఎన్‌ఆర్‌యూహెచ్‌ఎస్) మంగళవారం సాయంత్రం ఫలితాలు విడుదల చేసింది. ఆగస్టులో నిర్వహించిన ఫస్టియర్(యూజీ) పరీక్ష ఫలితాల్లో 148 మంది ఉత్తీర్ణత సాధించారు. ఇందులో నలుగురు డిస్టింక్షన్ సాధించగా, 108 మంది ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించారు. ఫస్టియర్ ఫలితాల్లో 98.66 శాతం ఉత్తీర్ణత నమోదైంది. అత్యుత్తమ ఫలితాలు సాధించినవారిని కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డా.సుధామాధురి అభినందించారు.

గోమారంలో జరిగింది చిన్న ఘటనే..

ఎమ్మెల్యే ఇంటిపై దాడి కాదు.. ఒకరినొకరు తోసుకున్నారు : మైనంపల్లి

నర్సాపూర్, సెప్టెంబరు 24: మెదక్ జిల్లా శివ్వంపేట మండలం గోమారంలో వినాయక నిమజ్జనం సందర్భంగా జరిగిన చిన్న ఘటనపై మాజీ మంత్రి హరీశ్‌రావు రాద్ధాంతం చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు మైనంపల్లి హన్మంతరావు పేర్కొన్నారు. నర్సాపూర్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆయన మాజీ ఎమ్మెల్యేలు మదన్‌రెడ్డి, నర్సారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, నియోజకవర్గ ఇన్‌చార్జిలు రాజిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు సుహాసినిరెడ్డి, రవీందర్‌రెడ్డిలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. చిన్న ఘటనకు రాద్ధాంతం చేసి హరీశ్‌రావు స్థాయిని తగ్గించుకున్నారని అన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేస్తున్నా.. కాంగ్రెస్ శ్రేణులు ఎంతో సహనంతో ఉంటున్నామని తెలిపారు. చిన్న తోపులాట జరిగితే రాజకీయ లబ్ధికోసం వాడుకోవాలని చూడడం దారుణమన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న హన్మంతరావు



శిక్షణ ఎస్‌ఐలతో సమావేశంలో మాట్లాడుతున్న సంగారెడ్డి ఎస్పీ రూపేష్

అన్నీ తెలుసుకోండి.. అంకితభావంతో పనిచేయండి

- శిక్షణా ఎస్‌ఐల సమావేశంలో ఎస్పీ రూపేష్

సంగారెడ్డి క్రైం, సెప్టెంబరు 24 : విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ కోరారు. జిల్లాకు కొత్తగా పది మంది శిక్షణా ఎస్‌ఐలను కేటాయించారు. వీరితో జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. క్రమశిక్షణ, అంకితభావంతో పనిచేసి పోలీసుశాఖకు మంచి పేరు తేవాలని పేర్కొన్నారు. ఎవరితో దురుసుగా ప్రవర్తించకూడదని, ఫిర్యాదుదారుల సమస్యలను ఓపిగ్గా విని పరిష్కారం కోసం కృషిచేయాలని సూచించారు. శిక్షణలో పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించే అన్నిరకాల విధులను తెలుసుకోవాలని, అప్పుడే కిందిస్థాయి సిబ్బందికి మార్గదర్శనం చేయగలరని సూచించారు. సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ సంజీవరావు, ఏవో ఈ.కల్యాణి, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ విజయకృష్ణ, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ రమేష్, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మైనింగ్‌పై అధికారుల విచారణ

రాంపూర్‌లో రాతికడీల నిల్వలు చూసి నివ్వెరపోయిన అధికారులు

7

హలో.. కొంచెం నెమ్మది

ఫోన్ మర్యాద పాటించాలంటున్న నిపుణులు

పక్కవారిని పట్టించుకోని 'సెల్' స్పీకర్లు

రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తా..

● సీఎం దృష్టికి డీలర్ల న్యాయమైన డిమాండ్లు
● రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు, ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, సెప్టెంబరు 24: సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న రేషన్ డీలర్ల న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తానని రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు, ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పట్టణంలోని జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాటుచేసిన రాష్ట్ర డీలర్ల సంఘం సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పౌర సరఫరాల్లో భాగంగా నిత్యావసర వస్తువుల పంపిణీలో కీలక పాత్ర పోషిస్తూ ప్రజల ఆహార భద్రతకు వారధిగా పనిచేస్తున్న డీలర్లకు అనేక సమస్యలు ఉన్నాయన్నారు. ఆరు దశాబ్దాల ఘనమైన చరిత్ర ఉన్న రేషన్ డీలర్ల సంఘానికి రాష్ట్ర గౌరవ అధ్యక్షుడిగా తనను ఎన్నుకోవడంపై కృతజ్ఞత తెలిపారు. తనపై పెట్టిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా సమస్యలను, హక్కులను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానన్నారు. ముఖ్యంగా ఐదువేల గౌరవ వేతనం, క్వింటాలుకు రూ.300ల కమీషన్ ఇవ్వాలన్న డిమాండ్‌ను పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. డీలర్ల డిమాండ్లను పరిష్కరించిన మరుక్షణం రూ.2 లక్షలతో హైదరాబాద్‌లో సీఎంకు కృతజ్ఞత సభను ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాయికోటి రాజు మాట్లాడుతూ ప్రధాన సమస్యలతో పాటు రూ.10 లక్షల ఇన్సూరెన్స్, ఎంఎల్ఎస్ పాయింట్లలో ఎలక్ట్రానిక్ తూకం వే బ్రిడ్జీలు, మృతిచెందిన డీలర్ల కుటుంబాలకు రేషన్ దుకాణాలను కేటాయించడం తదితర డిమాండ్లను పరిష్కరిస్తే ప్రభుత్వానికి రుణపడి ఉంటామన్నారు. ఈ సమావేశంలో జాతీయ అధ్యక్షుడు కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి విశ్వంబర్, వివిధ జిల్లాల నుంచి వేలాదిగా తరలివచ్చిన డీలర్లు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

టపాసులు కాలుస్తుండగా బాల కార్మికుడికి గాయాలు

శివ్వంపేట, సెప్టెంబరు 24: పంటను కోతులు, పిట్టల బెరద నుంచి రక్షించేందుకు టపాసులు కాలుస్తుండగా బాల కార్మికుడి చేతికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మెదక్ జిల్లా శివ్వంపేట మండలం గంగయ్యపల్లిలో ఆలస్యంగా వెలుగుచూసింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గంగయ్యపల్లిలోని ఆర్ఎన్‌డీఏ విత్తన పరిశ్రమలో యశ్వంత్(16) పనిచేస్తున్నాడు. అయితే పరిశ్రమ యాజమాన్యం కోతుల, పిట్టల బెడద నుంచి పంటను రక్షించేందుకు సుతిలి బాంబు టపాసులు కాల్చమని యశ్వంత్‌ను ఆదేశించారు. అతడు బాంబులు కాలుస్తుండగా చేయికి నిప్పు తగిలి గాయాలయ్యాయి. దీంతో పరిశ్రమ యాజమాన్యం గుట్టుచప్పుడు కాకుండా యశ్వంత్‌ను ఆస్పత్రిలో చికిత్స చేయించి ఇంటికి పంపించారు. బాల కార్మికుడితో పని చేయించడమే కాకుండా.. టపాసులు కాల్పించిన పరిశ్రమ యజమానిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.


బాలుడి చేతికి అయిన గాయం

మెదక్ స్టేడియానికి ఇందిరాగాంధీ పేరెలా కొనసాగిస్తారు..?: బీజేపీ


అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ మెదక్ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్

మెదక్ అర్బన్, సెప్టెంబరు 24: మెదక్ స్టేడియానికి ఎలాంటి ఆధారాలు లేకుండా ఇందిరాగాంధీ పేరెలా కొనసాగిస్తారని, వెంటనే శిలాఫలకంపై పేరు తొలగించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీవైఎస్‌వో దామోదర్‌రెడ్డిని కలిసి ఆయన వినతిపత్రాలు అందజేసి మాట్లాడారు. మెదక్ నుంచి ఇందిరాగాంధీ గెలిచి ప్రధాని అయితే ఈ ప్రాంతానికి చేసింది ఏమిలేదన్నారు. అప్పటి మంత్రి కరణం రాంచంద్రరావు విజ్ఞప్తి మేరకు ఎన్టీఆర్ హయాంలో స్టేడియాన్ని మంజూరు చేయించారన్నారు. 2000 సంవత్సరంలో సీఎం నారా చంద్రబాబు హయాంలో స్టేడియాన్ని ప్రారంభించారని గుర్తుచేశారు. అప్పటి నుంచి మెదక్ స్టేడియంగానే కొనసాగుతోందన్నారు. 2018లో ప్రధాని మోదీ సర్కార్ సింథటిక్ ట్రాక్ నిర్మాణానికి రూ.5.50 కోట్లను ఖేలో ఇండియా ద్వారా మంజూరు చేసిందన్నారు. అప్పటి రాష్ట్ర మంత్రి హరీశ్‌రావు లోపల కాంగ్రెస్.. బయట బీఆర్ఎస్‌లా వ్యవహరించి అధికారులను తప్పుతోవ పట్టించారని ఆరోపించారు. వెంటనే శిలాఫలకంపై ఇందిరాగాంధీ పేరు తొలగించి మెదక్ స్టేడియంగా కొనసాగించాలని, లేదా క్రీడలకు స్ఫూర్తి అయిన మేజర్ ధ్యాన్ చంద్, రామచంద్రరావు పేరు పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కరణం పరిణీత సోమశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఎల్ఎన్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ప్రసాద్ పాల్గొన్నారు.

హెల్మెట్ పెట్టుకుని ఉంటే..

- చేర్యాలలో వరుస ప్రమాదాలు
- మృత్యువాత పడుతున్న వాహనదారులు
- అన్ని హెల్మెట్ లేకపోవడం వల్లే..

చేర్యాల, సెప్టెంబరు 24 : అబ్బా.. రోడ్డు ప్రమాదంలో తలకు బలమైన గాయం తగలడంతోనే చనిపోయాడు.. హెల్మెట్ ధరించి ఉంటే కచ్చితంగా ప్రాణాలు దక్కేవి.. అంటూ ఘటనా స్థలాల్లో తరుచూగా ఇలాంటి మాటలు వింటుంటాం. అయితే హెల్మెట్ ధరించండి మహాప్రభో అంటూ ఇటు పోలీసులు, అటు కుటుంబ సభ్యులు చెబుతున్నా చాలామంది పెడచెవిన పెడుతున్నారు. ఈ నిర్లక్ష్యమే బైకు ప్రమాదాల రూపంలో పలువురి ప్రాణాలను హరిస్తున్నది. ఇటీవల చేర్యాల, కొమురవెల్లి మండలాల్లో జరిగిన వరుస ఘటనలే ఇందుకు నిలువెత్తు నిదర్శనం.

ఇటీవల జరిగిన ఘటనలివే..

● ఆదివారం రాత్రి చేర్యాల మండలం చుంచనకోట శివారులో బైకు చెట్టుకు ఢీకొన్న సంఘటనలో కొమురవెల్లి గ్రామానికి చెందిన కిష్టంపేట గ్రామానికి చెందిన తాపీ మేస్త్రీ మురళి తలకు గాయమై మృతి చెందాడు.

●కడవేరుగు శివారులో బైకుపైనుంచి కిందపడటంతో తలకు బలమైన గాయం తగిలి ఆ గ్రామానికి చెందిన డ్రైవర్ కొమ్మినేని కిషన్ దుర్మరణం చెందాడు. గుర్జకుంట శివారులో రోడ్డుపై రాంగ్‌పార్కింగ్ చేసి ఉన్న లారీని బైకుతో ఢీకొట్టి ప్రైవేటు టీచర్ దాసరి ప్రభాకర్ మృతిచెందాడు.

●పోసాన్‌పల్లి గ్రామశివారులో బైకుపై ట్రిబుల్ రైడింగ్‌తో అతివేగంగా ప్రయాణిస్తూ బోనకొల్లూరు కార్తీక్ చనిపోయాడు. నర్సాయపల్లి గ్రామశివారులో ఓ ఉపాధ్యాయుడు, గత నెలలో కర్నూలు జిల్లా దోన్ మండలం మల్కాపురం గ్రామానికి చెందిన వలస కార్మికుడు బోయ హరి బైకు ప్రమాదంలో దుర్మరణం చెందారు. ఇవన్నీ కేవలం హెల్మెట్ ధరించకపోవడం వల్ల జరిగిన మరణాలే.



తలకు గాయమై నర్సాయపల్లి దారిలో మృతి చెందిన వలస కార్మికుడు

అవగాహన కల్పిస్తున్నా పట్టింపేదీ..?

హెల్మెట్ శ్రీరామ రక్ష. రోడ్డుప్రమాద సమయంలో తలకు తగిలే గాయాల తీవ్రను తగ్గిస్తూ ప్రాణాలు కోల్పోకుండా ప్రభావంతంగా పనిచేస్తుంది. గాలి, వర్షం, ఎండ నుంచి తలకు పూర్తిరక్షణ కల్పిస్తూ ఆర్యోగాన్ని కాపాడుతుంది. ప్రతి ద్విచక్రవాహనదారుడు విధిగా విధిగా హెల్మెట్ ధరించాలి అని పోలీసులు, రవాణాశాఖ అధికారులు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నా వాహనదారులు పట్టించుకోవడం లేదు. అంతేకాకుండా రోడ్డుభద్రతా వారోత్సవాల పేరిట ప్రతిజ్ఞ చేయిస్తున్నా, ప్రదర్శనలు నిర్వహిస్తున్నా, జరిమానాలు విధిస్తున్నా చెవిటోడి ముందు శంఖం ఊదిన చందంగా వ్యహరిస్తూ ప్రాణాల మీదకు తెచ్చుకుని తమ కుటుంబాల్లో చీకట్లు నింపుతున్నారు.

పండ్లిచ్చి చెబుతున్నాం.. ప్రాణాలు కాపాడుకోండి..

● హెల్మెట్ వినియోగంపై పోలీసుల వినూత్న అవగాహన

వాహనాదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి.. ప్రాణాలు కాపాడుకోవాలని పోలీసులు మంగళవారం అవగాహన కల్పించారు. చేర్యాల సీఐ ఎల్. శ్రీను ఆధ్వర్యంలో సిబ్బంది వాహనదారులకు పండ్లు చేతికిస్తూ హెల్మెట్ ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఇటీవల చేర్యాల ప్రాంతంలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో అధికంగా హెల్మెట్ ధరించనివారే మృత్యువాతపడ్డారన్నారు. హెల్మెట్ దరిస్తే ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడవచ్చు అన్నారు. ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ రూల్స్‌ను పాటించాలని సూచించారు.





తలకు హెల్మెట్ లేకపోవడంతో కడవేరుగు దారిలో మరణించిన కిషన్

ప్రజల్లో మార్పు తీసుకువస్తాం..

రోడ్ సేఫ్టీలో భాగంగా బైకుపై ప్రయాణం చేసే ప్రతీ ఒక్కరూ విధిగా హెల్మెట్ దరించాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తూ సూచనలు చేస్తున్నాం. తప్పనిసరి పరిస్థితులలో జరిమానాలు కూడా విధిస్తున్నాం. అయినప్పటికీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో పలువురు నిండు ప్రాణాలు కోల్పోతున్నారు. మరింత పకడ్బందీ చర్యలు తీసుకుని ప్రజల్లో మార్పు తీసుకువస్తాం.

- శ్రీను, సీఐ చేర్యాల

ప్రభుత్వం, పట్టభద్రులకు వారధిగా పనిచేస్తా

● పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వి.నరేందర్ రెడ్డి



మాట్లాడుతున్న వి.నరేందర్‌రెడ్డి

మెదక్, సెప్టెంబరు 24 : తనను గెలిపిస్తే సమస్యల పరిష్కారానికి ప్రభుత్వానికి, పట్టభద్రుల మధ్య వారధిగా పని చేస్తానని ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, మెదక్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ అన్నారు. మంగళవారం ఆయన మెదక్‌లోని తెలంగాణ గురుకుల పాఠశాల, ప్రభుత్వ హైస్కూల్, జూనియర్, డిగ్రీ కళాశాలల అధ్యాపకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 34 సంవత్సరాలుగా విద్యారంగంలో ఉండి వేలాది మంది విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు బాటలు వేశానన్నారు. ఎమ్మెల్సీగా గెలిపిస్తే వచ్చే వేతనాన్ని నిరుపేద విద్యార్థులు, బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి వెచ్చిస్తానన్నారు. కార్యక్రమంలో వివిధ కళాశాలల ప్రిన్సిపాల్‌లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భూ పరిహారం ఇప్పించండి

● ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నకు భూ నిర్వాసితుల వినతి



ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నకు సమస్యను వివరిస్తున్న భూ నిర్వాసితులు

కుకునూరుపల్లి, సెప్టెంబరు 24 : భూమికి పరిహారం ఇప్పించాలని లకుడారం భూ నిర్వాసితులు మంగళవారం ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మల్లన్నసాగర్ నుంచి తపస్పల్లి రిజర్వాయర్ లింకు కాలువ నిర్మాణానికి లకుడారం గ్రామ రైతుల నుంచి 30 ఎకరాలు సేకరించి పనులను ప్రారంభించారన్నారు. ఎకరాకు రూ.16.50లక్షల చొప్పున పరిహారం ఇస్తామని చెప్పి రెండేళ్ల గడిచినా ఇప్పటికీ అందించలేదన్నారు. పలుమార్లు మంత్రి, కలెక్టర్‌కు వినతిపత్రాలు అందజేసిన ఫలితం లేదని ఎమ్మెల్సీతో తమ గోడును వెల్లబోసుకున్నారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్సీ సిద్దిపేట కలెక్టర్‌కి ఫోన్ చేసి సమస్యని పరిష్కరించాలని కోరగా ఆయన కలెక్టరేట్‌కి వచ్చి కలువాలని సూచించారు. అనంతరం ప్రజాభవన్‌లోనూ వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పట్ట రమేష్, సింగాటం అశోక్, ఎర్ర యాదగిరి, పైస పెంటయ్య, రాములు, కైలాసం తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల నిర్వహణ బాధ్యతలను సాధుసంతులకు అప్పగించాలి

● హిందూ ఆలయాల పరిరక్షణ సమితి డిమాండ్

కల్హేర్, సెప్టెంబరు 24 : అలయాల నిర్వహణ బాధ్యతలను దేవాదాయ శాఖ నుంచి తప్పించి సాధుసంతులు, సనాతన ధర్మ పరిరక్షకులకు అప్పగించాలని హిందూ ఆలయాల పరిరక్షణ సమితి నారాయణఖేడ్ నియోజకవర్గ బాధ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కల్హేర్‌లో స్థానిక తహసీల్దార్ శివ శ్రీనివాస్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సమితి బాధ్యులు సాయిరాం, అనిల్‌రెడ్డి, కరణం సంగమేశ్వర్‌రావు మాట్లాడుచూ హిందూ ఆలయాల్లో ఉద్యోగాలు నిర్వహిస్తున్న అన్య మతస్థులను తొలగించాలన్నారు. దేవాలయాల భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో సమితి బాధ్యులు రాజుగౌడ్, అల్లాపురం రాజు, రమేష్, కిష్టయ్య, పండరి, విటల్, బాగయ్య, పరుశురాం, సంతోష్, అరవింద్, నర్సింహులు, భిక్షపతి, రామక్రిష్ణ, నరేందర్, రాజేశ్వర్, సాయిరాం, గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ. 11.83 లక్షలు

వర్గల్, సెప్టెంబరు 24 : జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన నాచగిరి లక్ష్మీనృసింహాస్వామి క్షేత్రం హుండీని సోమవారం లెక్కించారు. దేవాదాయ శాఖ ఉమ్మడి మెదక్ జిల్లా సహాయ కమిషనర్ చంద్రశేఖర్ పర్యవేక్షణలో లెక్కింపు నిర్వహించారు. 75 రోజులకుగాను రూ.11,83,932 ఆదాయం సమకూరినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి అన్నపూర్ణ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సుధాకర్, పాండు, నరేందర్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

అధికారుల గైర్హాజరుపై సీపీఐ ఆందోళన

జహీరాబాద్, సెప్టెంబరు 24 : జహీరాబాద్ పట్టణంలోని పస్తాపూర్‌లోని కార్మిక శాఖ కార్యాలయానికి అధికారులు గైర్హాజరవడం సరికాదని సీపీఐ డివిజన్ కార్యదర్శి నర్సింహులు అన్నారు. మంగళవారం ఆ పార్టీ నాయకులు కార్మికశాఖ అధికారులకు సమస్యలపై విన్నవిద్దామని వెళ్లితే కార్యాలయానికి తాళం ఉండడంతో వారు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగ వారు మాట్లాడుతూ 20 రోజులుగా కార్యాలయంలో అధికారులు లేకపోవడంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. డెత్ క్లెయిమ్‌లు, మ్యారెజీ, డెలివరిగిఫ్టులు, లేబర్‌కార్డులు తదితర అవసరాల నిమిత్తం వస్తున్న కార్మికులు వెనుదిరిగి పోతున్నారన్నారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు.

కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య

తూప్రాన్, సెప్టెంబరు 24: కుటుంబ కలహాలతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన తూప్రాన్ పట్టణ పరిధి ఆబోతుపల్లిలో చోటు చేసుకుంది. తూప్రాన్ ఎస్ఐ శివానందం కథనం ప్రకారం గ్రామానికి చెందిన ఆబోతు ప్రవీణ్ (31) భార్య వరలక్ష్మి మధ్య ఈ నెల 18న సంసారం విషయంలో గొడవ జరిగింది. దీంతో భార్య పిల్లలను తీసుకురావడానికి పాఠశాలకు వెళ్లగా.. భర్త ప్రవీణ్ ఇంట్లో ఉన్న గడ్డి మందు తాగాడు. గుర్తించిన కుటుంబీకులు చికిత్స కోసం కొంపల్లిలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతిచెందాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అమ్మవారి ఆలయంలో మళ్లీ చోరీ

కుకునూరుపల్లి, సెప్టెంబరు 24: రాయవరం దుర్గమ్మ గుడిలో మరోసారి దొంగలు వారి చేతివాటం ప్రదర్శించారు. గ్రామానికి అర కిలోమీటరు దూరంలో ఉన్న ఈ ఆలయంలో ఇప్పటికే రెండుసార్లు దొంగతనం జరుగగా.. సోమవారం రాత్రి కూడా దుండగులు చోరీకి పాల్పడ్డారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం ఆలయ నిర్వాహకులు మంగళవారం ఆలయానికి వెళ్లగా తలుపులు తీసి ఉండడం, వస్తువులు చిందరవందరగా పడి ఉండడంతో గ్రామస్థులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని పరిశీలించగా అమ్మవారి పుస్తెమట్టెలు, వెండి ఆభరణాలతో పాటు హుండీ నగదును దుండగులు దోచుకెళ్లారు. అయినా ఆలయ నిర్వాహకులు పోలీసులకు సమాచారం ఇవ్వకపోవడం గమనార్హం. ఈ ఆలయం వద్ద భద్రతాచర్యలు లేకపోవడంతో తరుచూ దొంగతనాలు జరుగుతున్నాయని స్థానికులు వాపోయారు.

గ్యాస్ రీఫిల్ చేస్తూ పట్టుబడిన ఏజెన్సీ సిబ్బంది

●చర్యలు తీసుకోవాలని గ్రామస్థుల డిమాండ్



ఖాళీ గ్యాస్ సిలిండర్‌ను కొలుస్తున్న గ్రామస్థులు

వెల్దుర్తి, సెప్టెంబరు 24 : వినియోగదారులకు డెలివరీ చేయాల్సిన గ్యాస్ సిలిండర్ నుంచి ఖాళీ సిలిండర్‌లోకి రీఫిల్ చేస్తున్న వ్యక్తులు పట్టుబడ్డారు. వివరాల్లోకి వెళ్లితే వెల్దుర్తిలోని ఇండియన్ ఎస్‌వీఆర్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు మంగళవారం మండల పరిధిలోని దామరంచ గ్రామానికి గ్యాస్ సిలిండర్లను ఇవ్వడానికి వెళ్లారు. ఈ క్రమంలో గ్రామం వెలుపల వ్యవసాయ పొలాల వద్ద వాహనాన్ని ఆపి నిండు సిలిండర్ నుంచి ఖాళీ సిలిండర్‌లోకి గ్యాస్ రీఫిల్ చేస్తున్నారు. అక్కడే పొలంలో ఉన్న ఓ మహిళ ఇచ్చిన సమాచరం మేరకు అక్కడికి చేరుకున్న గ్రామస్థులు వారిని గ్రామ పంచాయతీ వద్దకు తీసుకెళ్లారు. 15.9 కిలోలు ఉండాల్సిన ఖాళీ సిలిండర్ 18 కిలోలు రావడం, 29.8 కిలోలు ఉండాల్సిన నిండు గ్యాస్ సిలిండర్ 28 కిలోలు మాత్రమే ఉన్నది. విషయం తెలుసుకున్న ఆ ఏజెన్సి నిర్వాహకుడు వెన్నవరం శ్రీనివాస్‌రెడ్డి దామరంచకు రాగా గ్రామస్థులు నిలదీశారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు స్పందించి నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు.

అక్రమ మైనింగ్‌పై విచారణ

●రాతికడీల నిల్వలు చూసి నివ్వెరపోయిన అధికారులు



రాంపూర్‌లో అక్రమ మైనింగ్ పై విచారణ జరుపుతున్న తహసీల్దార్ అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అల్లాదుర్గం, సెప్టెంబరు 24 :ప్రభుత్వ భూమిలో అక్రమ మైనింగ్‌పై అల్లాదుర్గం తహసీల్దార్ అధికారులు మంగళవారం విచారణ జరిపారు. ఈ నెల 24న కొండలు పిండి..గుట్టలు గుల్ల.. శీర్షికతో ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై తహసీల్దార్ మల్లయ్య, ఆర్ఐ సందీప్, సర్వేయర్ రాజునాయక్ స్పందించి ఆయా స్థలాలను పరిశీలించారు. భారీగా నిల్వ ఉన్న రాతి కడీలను చూసి అధికారులే నివ్వెరపోయారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ అనుమతులు లేకుండా ప్రభుత్వ భూమిలో మైనింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాగా, రాంపూర్‌లో జరుగుతున్న అక్రమ మైనింగ్‌పై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

సాఫ్ట్‌బాల్ పోటీల్లో మెదక్ జిల్లాకు బంగారు పతకం

తూప్రాన్, సెప్టెంబరు 24: రాష్ట్ర స్థాయి జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో మెదక్ జిల్లా బాలుర జట్టు బంగారు పతకం సాధించినట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కొడిప్యాక నారాయణగుప్తా తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఈ నెల 21 నుంచి 23 వరకు జరిగిన పోటీల్లో జిల్లా బాలుర జట్టు మొదటి నుంచీ ఆధిపత్యం కనబర్చినట్లు తెలిపారు. ఫైనల్‌లో నిజామాబాద్ జట్టుతో జరిగిన హోరాహోరీ పోరులో 5-3 స్కోర్‌తో విజయ సాధించిందన్నారు.



బంగారు పతకం సాధించిన జిల్లా జట్టు

జవహర్ నవోదయ విద్యాలయానికి పీఎం శ్రీ స్కూల్ హోదా

వర్గల్, సెప్టెంబరు 24 : వర్గల్ కేంద్రంలోని జవహర్ నవోదయ విద్యాలయానికి పీఎం శ్రీ స్కూల్ హోదా దక్కినట్లు ఆ విద్యాలయం ప్రిన్సిపాల్ రాజేందర్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మొదటి దశలో 2022లో భారత ప్రభుత్వం దేశవ్యాప్తంగా సుమారు 14500 పీఎం శ్రీ విద్యాలయాలను గుర్తించిందన్నారు. వీటికి కేంద్ర ప్రభుత్వం నేరుగా నిధులు మంజూరు చేస్తూ అభివృద్ధి, వనరుల సమీకరణ చేస్తుందన్నారు. అదేవిధంగా ప్రస్తుతం రెండవ దశలలో భాగంగా జవహర్ నవోదయ విద్యాలయాన్ని కేంద్రం గుర్తించడం సంతోషంగా ఉందన్నారు. కేంద్రం అందించే నిధులతో విద్యాలయాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామన్నారు.



రోడ్డు ప్రమాదం.. బొలెరోలో ఇరుక్కున్న డ్రైవర్

●రెండు గంటలు శ్రమించి రక్షించిన పోలీసులు, ఫైర్ సిబ్బంది

రామాయంపేట, సెప్టెంబరు 24 : రామాయంపేట బైపాస్‌లో మంగళవారం వేకువ జామున రోడ్డు ప్రమాదం జరుగుగా ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళ్లితే మహారాష్ట్ర నుంచి హైదరాబాద్ వైపు సంత్రాల లోడ్‌తో వెళ్తున్న బొలెరో వాహనం ముందు కారును బలంగా ఢీకొట్టింది. కారు రోడ్డు కిందకు దూసుకెళ్లగా.. నుజ్జునజ్జయిన బొలెరోలో డ్రైవర్ జమీర్ ఖాన్ ఇరుక్కుపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు, 108, ఫైర్, పోలీస్ సిబ్బంది ఘటన స్థలికి చేరుకుని రెండు గంటల పాటు శ్రమించి రక్షించారు. తీవ్ర గాయాలైన జమీర్, క్లీనర్ ఇజ్రాయిల్ ను రామాయంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి హైదరాబాదుకు తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.



బొలెరో వాహనంలో ఇరుక్కున్న డ్రైవర్

ఎల్ఈడీ ట్యూబ్‌లైట్ల తయారీపై వర్క్‌షాప్



ఎల్ఈడీ ట్యూబ్‌లైట్ల తయారీ విధానాన్ని తెలుసుకుంటున్న విద్యార్థులు

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 24 : సంగారెడ్డిలోని జిల్లా సైన్స్ కేంద్రంలో జాతీయ హరిత దళం ఆధ్వర్యంలో మంగళవారం జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఎల్ఈడీ ట్యూబ్‌లైట్ల తయారీపై కార్యశాల నిర్వహించారు. జిల్లాలోని 50 పాఠశాలలకు చెందిన 150 మంది విద్యార్థులు, 50 మంది ఉపాధ్యాయులకు తయారీ విధానాన్ని వివరించారు. పర్యావరణానికి మేలు చేసే ఈ ఎల్ఈడీ ట్యూబ్ లైట్లు తక్కువ విద్యుత్ ఖర్చుతో ఎక్కువ కాంతిని ఇస్తాయని రిసోర్స్ పర్సన్, రాష్ట్ర ఎన్‌జీసీ ప్రాజెక్టు అధికారి రాజశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా డీఈవో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సాంప్రదాయేతర ఇంధన వనరులను వాడుకొని మనందరం పర్యావరణాన్ని కాపాడాలన్నారు. అనంతరం శిక్షకులు కార్తిక్, సాయి విద్యార్థులకు కంపోస్ట్ గుంతలు ఎలా నిర్వహించాలో వివరించారు. కార్యక్రమంలో సీఎంవో వెంకటేశం, ఏఎంవో అనురాధ, డీఎస్‌వో సిద్ధారెడ్డి, ఎన్‌జీసీ జిల్లా సమన్వయకర్త మాధవరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంస్య పతకం విజేతకు సత్కారం



అశ్వితను సత్కరించి సన్మానిస్తున్న గ్రామస్థులు, పెద్దలు

కొండాపూర్, సెప్టెంబరు 24 : అంతర్జాతీయ వేదికపై పాకశాస్త్రంలో కాంస్య పతకం సాధించిన తెలంగాణ అమ్మాయికి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం గిర్మాపూర్ చెందిన పోలీస్ అశ్విత అంతర్జాతీయ వేదికపై క్యాంస పతకం సాధించింది. ఫ్రాన్స్‌లోని లియాన్ నగరంలో పాకశాస్త్రంపై జరిగిన వరల్డ్ స్కిల్- 2024లో బెస్ట్ ఆఫ్ నేషనల్ కాంస్య అవార్డును గెలుచుకుంది. సెప్టెంబరు 11-15 మధ్య జరిగిన ఈ పోటీల్లో 70 దేశాల నుంచి 1400 మందికి పైగా పోటీ పడగా అశ్విత ప్రతిభను కనబర్చింది. కాగా, మంగళవారం అశ్వితను గిర్మాపూర్ గ్రామస్థులు ఘనంగా సత్కరించారు.. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు, జయరాములు, మల్లేషం, నిర్మల, గ్రామస్తులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేశాకే పరిశ్రమల నిర్మాణ పనులు చేపట్టాలి

● రెండో రోజు భూనిర్వాసితుల ఆందోళన

వర్గల్, సెప్టెంబరు 24 : భూ సేకరణ సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేశాకే పరిశ్రమల నిర్మాణం చేపట్టాలని టీజీఐఐసీ భూ నిర్వాసితులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు రెండోరోజు సోమవారమూ ఆందోళనలు చేపట్టి పరిశ్రమల నిర్మాణ పనులను అడ్డుకునారు. కార్యక్రమంలో రైతులు గోవర్ధన్‌రెడ్డి, నర్సారెడ్డి, పుసుల రమేశ్, యాదగిరి, నందు, అంజయ్య, శివయ్య, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

హలో.. కొంచెం నెమ్మది



ఫోన్ మర్యాద పాటించాలంటున్న నిపుణులు

- పరిసరాల్లో ఉన్న వారికి ఇబ్బంది కలిగించకూడదని సూచన
- ఆ దిశగా చర్యలు లేకపోవడం లోపమేనంటున్న కంపెనీలు
- అసందర్భమైన రింగ్‌టోన్‌లతో అసహనం
- ఆఫీసుల్లోనూ పక్కవారిని పట్టించుకోని 'సెల్'స్పీకర్లు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 24 (ఆంధ్రజ్యోతి): తాము ఎక్కడ ఉన్నామనే స్పృహ లేకుండా సెల్‌ఫోన్‌లో అరిచినట్లుగా మాట్లాడడం, చెవులు చిల్లులు పడేలా రింగ్‌టోన్లు, ప్రయాణ సమయంలో ముందూ వెనుకా ఉన్న వారికి అంతరాయం కలుగుతుందన్న స్పృహ లేకుండా పెద్ద సౌండ్‌తో వీడియోలు చూడడం.. చెప్పుకుంటూ పోతే ఎన్నెన్ని సిత్రాలో. చాలామందికి ఇప్పటికీ ఫోన్ మాట్లాడటం రాదంటున్నారు సెల్‌ఫోన్ ఆపరేటర్లు. పాశ్చాత్య దేశాలతో పోలిస్తే మన దగ్గర కనీస సెల్‌ఫోన్ మానర్స్ లేదని, అసలు దీని పట్ల అవగాహన కూడా లేదని చెబుతున్నారు ఎటిక్యాట్ శిక్షకులు. ఇదే విషయాన్ని సెల్యులార్ ఆపరేటర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (సీఓఏఐ) ప్రతినిధులు ధ్రువీకరిస్తున్నారు. అన్‌లిమిటెడ్ కాలింగ్ సౌక్యం వచ్చిన తర్వాత అనవసర విషయాలనే ఫోన్‌లలో చర్చించడం పెరిగిపోయిందని, వదిలేయమన్నా, జిడ్డులా తమ సంభాషణ కొనసాగించి చంపేస్తున్నారని వాపోతున్న వారు ఎక్కువగానే ఉంటున్నారు. ఒక్కరే ఉన్నప్పుడు ఫోన్ ఎలా ఉపయోగించినా కాన్ఫరెన్స్‌లకు హాజరైనప్పుడు, ఆఫీస్‌లో ఉన్నప్పుడు, ఇతరులతో మాట్లాడుతున్నప్పుడు కొన్ని సూచనలు పాటించాలని సెల్‌ఫోన్ ఎటిక్యాట్ నిపుణులు నమ్రత సూచిస్తున్నారు.



ఫోన్లు చూస్తూ కూర్చోవద్దు..

సమావేశాల్లో పాల్గొన్నప్పుడు విషయం మీద శ్రద్ధ వహించాలి తప్ప వాట్సాప్, మెసేజింగ్ చేయడం లేదంటే సోషల్ మీడియాలో పోస్టింగ్స్ చేయడం సరైంది కాదు.

ఇప్పుడూ మిస్డ్ కాలేనా..

అన్‌లిమిటెడ్ కాలింగ్ సౌకర్యం ఉన్నప్పటికీ మిస్డ్ కాల్ ఇచ్చే వారు ఇప్పటికీ అక్కడక్కడా ఉన్నారు. ఫోన్ లిఫ్ట్ చేయడమే వృథా అనుకునే వారికి ఇది అదనపు చిరాకు తెప్పిస్తుంది.

ఫోన్‌ను సైలెంట్ లేదా వైబ్రేట్ మోడ్‌లో ఉంచండి..

'దయచేసి మీ మొబైల్‌ఫోన్‌ను స్విచ్ఛాఫ్ చేయండి. లేదంటే సైలెంట్‌లో ఉంచండి' అని చాలాచోట్ల ఈ సూచన వినిపిస్తుంది. చాలామంది దీన్ని పట్టించుకోరు. ఆఫీసుల్లో

మిగతా 6వ పేజీలో..

మూవీ రింగ్‌టోన్స్ అసలు పెట్టకూడదు..

మీకు ఎంత ఇష్టమైన సినిమా పాట అయినా సరే మొబైల్ రింగ్ టోన్‌గా పెట్టుకోకపోవడమే మంచిది. మీరున్న సందర్భానికి సూట్ కాని పాటలు ఒక్కోసారి ఇబ్బందిగా మారవచ్చు.

తర్వాత చేస్తామంటే చేయాల్సిందే..

మీరు మీటింగ్‌లో ఉన్నప్పుడు తర్వాత చేస్తామని చెప్పడం లేదా మెసేజ్ చేసి వదిలేశారంటే అది మీపై అవతలి వారికి చెడు అభిప్రాయం కలిగించవచ్చు. కాల్ బ్యాక్ ఆఫ్టర్ 15 మినిట్స్ అని మెసేజ్ పెడితే 15 నిమిషాల తర్వాత అవతలి వ్యక్తికి ఫోన్ చేయాలి. కుదరని పక్షంలో అరగంట తరువాత అయినా ఫోన్ చేసి ముందుగా అవతలి వ్యక్తికి క్షమాపణ చెప్పి మీ సంభాషణ కొనసాగించాలి.

మాట్లాడే ముందు.. అడగాలి..!

మీకు బాగా క్లోజ్‌గా ఉన్నవాళ్లు లేదంటే బంధువులు అయితే పర్వాలేదు కానీ తెలియని అంతగా పరిచయం లేని వ్యక్తులతో మాట్లాడేముందు.. అవతలి వ్యక్తితో మీరు మాట్లాడటానికి సరి అయిన సమయమేనా అని అడగాలి. అవతలి వ్యక్తి కొనసాగించాలి అన్నప్పుడు మాత్రమే సంభాషణ కొనసాగించాలి. ఒకవేళ అతను తరువాత ఫోన్ చేయమంటే.. ఎంతసేపటి తరువాత చేయమంటారని గౌరవంగా అడగడంలో తప్పులేదు.

అంతర్జాతీయ సదస్సుకు డా.కృష్ణమూర్తికి ఆహ్వానం



డా.కృష్ణమూర్తి

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 24: అమెరికాలోని హూస్టన్ నగరంలో కాంగ్రెస్ ఆఫ్ న్యూరోలాజికల్ సర్జన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 28వ తేదీన నిర్వహించే అంతర్జాతీయ సదస్సుకు సంగారెడ్డి జిల్లాకు చెందిన ప్రముఖ న్యూరో సర్జన్, హోప్ న్యూరో అండ్ కార్డియాక్ హాస్పిటల్ అధినేత డా.కృష్ణమూర్తికి ఆహ్వానం లభించింది. ఐదురోజుల పాటు జరగనున్న ఈ సదస్సులో ఆయన పాల్గొననున్నారు. ఈ సందర్భంగా డా.కృష్ణమూర్తి మాట్లాడుతూ అత్యాధునిక వైద్య విధానాలు, సాంకేతిక పరిజ్ఞానం, దాని ఉపయోగంపై అవగాహన పెంచుకుని సంగారెడ్డి జిల్లా, పట్టణ పరిసర ప్రాంతాల ప్రజలకు అంతే అత్యాధునిక వైద్యమందించే ప్రయత్నం చేస్తానని తెలిపారు. డా.కృష్ణమూర్తికి పలువురు శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు.

అదృశ్యమైన యువకుడు చెరువులో శవమై..


శేఖర్(ఫైల్)

కల్హేర్, సెప్టెంబరు 24: రెండు రోజుల క్రితం ఇంట్లో నుంచి వెళ్లి అదృశ్యమైన యువకుడు సిర్గాపూర్‌లోని సాకి చెరువులో మంగళవారం శవమయ్యాడు. సిర్గాపూర్ ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం సిర్గాపూర్‌కు చెందిన శేఖర్(32) మద్యానికి బానిసయ్యాడు. గత 15 రోజుల నుంచి మద్యానికి దూరమయ్యాడు. దీంతో మతి స్థిమితం కోల్పోయిన శేఖర్ ఈ నెల 22న తెల్లవారుజామున ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. మృతుడి సోదరుడు విఠల్ సోమవారం ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసుగా నమోదు చేశారు. సిర్గాపూర్ గ్రామ శివారులో సాకి చెరువు నీటిలో శవం తేలి ఉన్నట్లు సమాచారం అందడంతో వెళ్లి చూడగా ఆ మృతదేహం శేఖర్‌దేనని కుటుంబీకులు గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం


మృతి చెందిన వ్యక్తి

సంగారెడ్డి క్రైమ్, సెప్టెంబరు 24 : సంగారెడ్డి రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కులబ్‌గూర్ గ్రామ శివారులో మంగళవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి మండలం కులబ్‌గూర్ గ్రామ శివారులోని గల రాఘవేంద్ర రైస్‌మిల్ ముందు సంగారెడ్డి నుంచి జోగిపేటకు వెళ్లే రోడ్డు పక్కన ఓ గుర్తుతెలియని 35 ఏళ్ల లోపు వ్యక్తి స్పృహ తప్పి పడి ఉండగా స్థానికులు గమనించి 108 అంబులెన్స్‌కు ఫోన్ ద్వారా సమాచారమిచ్చారు. 108 సిబ్బంది సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్టు తెలిపారు. మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీలో భద్రపర్చినట్టు పోలీసులు తెలిపారు. మృతుడు చామనఛాయ రంగు కలిగి 5.4 ఎత్తు ఉండి ఎరుపు రంగు ఫుల్ షర్టు, గ్రే కలర్ ప్యాంటు ధరించి ఉన్నాడు. ఎవరైనా గుర్తిస్తే 8712656746, 8710656719 నంబర్లకు సమాచారం అందించాలన్నారు.

సూరారంలో పిడుగుపాటుకు చెట్టు ధ్వంసం

చిన్నశంకరంపేట, సెప్టెంబరు 24: మండలంలోని సూరారం గ్రామంలో మంగళవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. గ్రామం నడిబొడ్డున ఉన్న మసీద్ సమీపంలోని చెట్టుపై భారీ శబ్దంతో పిడుగు పడి మంటలు చెలరేగి చెట్టు కాలిపోయింది.. అక్కడ ఎవరు లేకపోవడంతో ప్రాణ నష్టం తప్పింది. వారం రోజుల క్రితం అంబాజీపేటలో ట్రాన్స్‌ఫార్మర్‌పై పడుగు పడిన విషయం తెలిసిందే.

ఎస్‌జీఎఫ్ క్రీడల్లో రాణించిన గిరిజన బాలురు

పుల్‌కల్, సెప్టెంబరు 24: చౌటకూర్ మండలం బొమ్మారెడ్డిగూడెం గిరిజన ఆశ్రమ పాఠశాల బాలురు ఎస్‌జీఎఫ్ క్రీడల్లో రాణించారు. మూడు రోజుల క్రితం పటాన్‌చెరులో జరిగిన జిల్లాస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కబడ్డీ క్రీడలో గిరిజన ఆశ్రమ పాఠశాల అండర్ 14 విభాగం బాలురు పాల్గొన్నారు. జిల్లా స్థాయిలో జరిగిన ఎస్‌జీఎఫ్ కబడ్డీ క్రీడలో పాల్గొని ప్రథమ బహుమతిని కైవసం చేసుకున్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదులో జిల్లా ముందుండాలి


సంగారెడ్డిలో సభ్యత్వ నమోదు చేయిస్తున్న గోదావరిఅంజిరెడ్డి

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 24: సభ్యత్వ నమోదులో తెలంగాణాలోనే సంగారెడ్డి జిల్లా ముందుండాలని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరిఅంజిరెడ్డి పేర్కొన్నారు. సంగారెడ్డిలోని పాత బస్టాండ్ వద్ద సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఇందులో భాగంగా వర్తక, వాణిజ్య సముదాయాలకు తిరుగుతూ ఇంటింటికీ సభ్యత్వాన్ని చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలోనే మెదక్ పార్లమెంట్ నియోజకవర్గం సభ్యత్వ నమోదులో రెండో స్థానంలో ఉందన్నారు. పట్టణ అధ్యక్షుడు ద్వారక రవి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు దేశ్‌పాండే, పోచారం రాములు, వెంకటనర్సింహారెడ్డి, మాణిక్‌రావు, విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ పరీక్ష ఫీజు చెల్లించండి

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 24: ఉమ్మడి మెదక్ జిల్లా ఓపెన్ స్కూల్ విధానంలో అడ్మిషన్ పొంది అక్టోబరులో నిర్వహించనున్న పదోతరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలకు హాజరుకానున్న అభ్యాసకులు తత్కాల్ స్కీమ్ ద్వారా ఈ నెల 25, 26 వ తేదీల్లో ఆన్‌లైన్‌లో పరీక్ష ఫీజు చెల్లించాలని డీఈవో వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మీసేవ, టీఎస్ ఆన్‌లైన్‌లో మాత్రమే ఫీజు చెల్లించాలన్నారు. పదవ తరగతి ప్రతీ సబ్జెక్టుకు రూ.100, ప్రాక్టికల్‌కు రూ.100, తత్కాల్ ఫీజు రూ.500 అదనం, ఇంటర్మీడియట్ ప్రతీ సబ్జెక్టుకు రూ.150, ప్రాక్టికల్‌కు రూ.150, తత్కాల్ ఫీజు రూ.1000 అదనంగా చెల్లించాలని సూచించారు. పూర్తి వివరాలకు ఓపెన్ స్కూల్ జిల్లా కో ఆర్డినేటర్ వెంకటస్వామిని సంప్రదించాలని ఆయన కోరారు.

వీరభద్రస్వామి హుండీ ఆదాయం రూ.18 లక్షలకు పైనే..

గుమ్మడిదల, సెప్టెంబరు 24 : మండలంలోని బొంతపల్లి వీరన్న గూడెం వీరభద్రస్వామి ఆలయంలో మంగళవారం ఆలయ హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని జిల్లా సూపరింటెండెంట్ శివరాజ్, కార్యనిర్వహణ అధికారి శశిధర్ గుప్తా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆలయానికి రూ. 18,23,572 ఆదాయం హుండీ ద్వారా సమకూరినట్టు తెలిపారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఆలయ కమిటీ ఛైర్మన్ ఆలేటి శ్రీనివాస్‌రెడ్డి మద్ది ప్రతాపరెడ్డి, లక్ష్మీనారాయణ, ఆలయ సిబ్బంది సోమయ్య, రవీంద్రమూర్తి ప్రజలు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు రూ.20 లక్షలు ఇవ్వాలి

కంది, సెప్టెంబరు 24 : అక్షయపాత్రలో విధులు నిర్వహించడానికి వస్తూ గత జూన్ 25న రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన అభిషేక్, నవీన్, సందీప్‌ల కుటుంబాలకు రూ.20 లక్షల నష్టపరిహారాన్ని అందించాలని మంగళవారం ప్రజా సంఘాల నాయకులు ఆనంద్‌రావు, బూడిద నవాజ్ తదితరులు ఆందోళనకు దిగారు. అక్షయపాత్ర మెయిన్ గేటు వద్ద ఆ సంస్థలో పనిచేస్తున్న కార్మికులతో కలిసి నినాదాలు చేస్తూ బైఠాయించారు. దీంతో అక్షయపాత్ర ద్వారా ఇతర పాఠశాలలకు భోజనం అందించాల్సిన వాహనాలు కొద్దిసేపు నిలిచిపోయాయి. అనంతరం సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్య ఆందోళనకారులకు నచ్చజెప్పి ఒక్కో మృతుడి కుటుంబానికి రూ.2 లక్షలు ఇప్పిస్తామన్నారు.

పరిశుభ్రతను నిర్లక్ష్యం చేస్తే అనారోగ్య సమస్యలు

● పలు మండలాల్లో స్వచ్ఛతాహీ సేవా


జహీరాబాద్: రైల్వేస్టేషన్‌లో పరిసరాలను శుభ్రం చేస్తున్న రైల్వే అధికారులు, కేవీకే శాస్త్రవేత్తలు

జహీరాబాద్, సెప్టెంబరు 24: పరిశుభ్రత విషయంలో నిర్లక్ష్యం చేస్తే అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని డీడీఎస్-కేవీకే శాస్త్రవేత్త సాయిప్రియాంక, కెలాష్, స్టేషన్ మేనేజర్ మాధవక్రిష్ణ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైల్వేస్టేషన్ పరిసరప్రాంతాలను చీపుర్లతో శుభ్రంచేసి, స్వభావ స్వచ్ఛత, సంస్కార స్వచ్ఛతపై ప్రయాణికులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రయాణికులు, అధికారులు పాల్గొన్నారు.

● రాయికోడ్: ప్రతీ విద్యార్థి ఒక మొక్కను సంరక్షించాలని మండలప్రత్యేక అధికారి జగదీశ్వర్ సూచించారు. మండల పరిధిలోని అల్లాపూర్ గ్రామ శివారులో గల గురుకుల పాఠశాలలో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి నీరు పోశారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.ఎం.షరీఫ్, ఎంపీవో అంజలీదేవి, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

● నిజాంపేట: ప్రతి ఒక్క విద్యార్థి తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే ఆరోగ్యంగా ఉంటారని, ఇందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంతో పాటు నస్కల్ గ్రామాన్ని సందర్శించి స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంపై జడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. పలువురు విద్యార్థులు డ్రాయింగ్, వ్యాసరచన, నటన ద్వారా స్వచ్ఛభారత్‌పై తోటి విద్యార్థులకు వివరించారు. అనంతరం పాఠశాల మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజిరెడ్డి, ఎంపీవో ప్రవీణ్, కార్యదర్శి నర్సింలు, ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు ఉన్నారు.

● పాపన్నపేట: స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా మంగళవారం పాపన్నపేట ఉన్నత పాఠశాలలో ఎంపీడీవో విష్ణువర్దన్ ఆధ్వర్యంలో బాలబాలికలకు పాటల పోటీ, నృత్య పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నప్పటి నుంచే వ్యక్తిగత పరిశుభ్రతను అలవర్చుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మహేశ్వర్, ఎంపీవో పరమేష్, గ్రామ కార్యదర్శి నయీం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టార్గెట్లను పూర్తిచేయాలి: డీపీఎం


ఐకేపీ కార్యాలయంలో లబ్ధిదారులకు మంజూరు పత్రాన్ని అందజేస్తున్న డీపీఎం

ఝరాసంగం, సెప్టెంబరు 24: ఇచ్చిన టార్గెట్లను క్రమం తప్పకుండా పూర్తిచేయాలని డీపీఎం జయశ్రీరాజ్ పేర్కొన్నారు. మంగళవారం మండలకేంద్రమైన ఝరాసంగంలోని ఐకేపీ కార్యాలయంలో ఇందిర మహిళాశక్తి సభ్యులతో సమావేశం నిర్వహించారు. అందులో భాగంగా క్లస్టర్లవారీగా సెప్టెంబరు నెలలో చేయాల్సిన టార్గెట్ల గురించి చర్చించారు. ఇచ్చిన టార్గెట్‌లను సకాలంలో గ్రౌండింగ్ పూర్తిచేసేలా చర్యలు చేపట్టాలన్నారు. ఇబ్బందులుంటే తమదృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎంలు, సీసీలు తదితరులు పాల్గొన్నారు.

వరకట్న నిషేధ చట్టాలపై అవగాహన ఉండాలి

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 24: ప్రతి ఒక్కరూ వరకట్న నిషేధ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రమేశ్ తెలిపారు. సంగారెడ్డిలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహహింస, బాల్య వివాహ నిషేధ చట్టం, పోక్సో చట్టం తదితరాలపై అవగాహన ఉండాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

పీసీసీ అధ్యక్షుడిని కలిసిన మత్స్యశాఖ డైరెక్టర్


మహేష్‌కుమార్‌గౌడ్‌తో గడప దేవేందర్

తూప్రాన్, సెప్టెంబరు 24: టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌ను మెదక్ జిల్లా మత్స్యశాఖ డైరెక్టర్ గడప దేవేందర్ మర్యాద పూర్వకంగా కలిశారు. మంగళవారం టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌ను కలిసి సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు.

గణపతి లడ్డూను సొంతం చేసుకున్న ముస్లిం

కౌడిపల్లి, సెప్టెంబరు 24: కులమతాలకు అతీతంగా గణపతి లడ్డూను ఓ ముస్లిం యువకుడు సొంతం చేసుకున్నాడు. కౌడిపల్లి మార్కెట్‌లో ప్రతిష్ఠించిన వినాయకుడి లడ్డూను మంగళవారం వేలం వేయగా గ్రామానికి చెందిన మక్బూల్ అనే ముస్లిం యువకుడు రూ. 36,616 లకు వేలంలో దక్కించుకున్నాడు. అనంతరం యువకుడు మాట్లాడుతూ తనకు వినాయుడి ఆశీస్సులు ఉండాలని లడ్డూను కొనుగోలు చేసినట్టు తెలిపాడు.మరో లడ్డూను పోల జనార్దన్ రూ.7 వేలకు దక్కించుకున్నాడు.

'నెలకు రూ.26 వేలు ఇవ్వాలి'

కంది, సెప్టెంబరు 24 : కాంట్రాక్ట్ కార్మికులకు నెలకు రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజయ్య డిమాండ్ చేశారు. సీఐటీయూ సంగారెడ్డి క్లస్టర్ ఆధ్వర్యంలో మంగళవారం కందిలో దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లేశ్ మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికులకు ఈఎస్ఐ, పీఎస్, ప్రమాదబీమా, ఉద్యోగ భద్రతలు వెంటనే కల్పించాలన్నారు ఈ నెల 28న కలెక్టరేట్ వద్ద దర్నాకు కార్మికులు భారీగా హాజరుకావాలన్నారు.

'తారా'లో ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవం

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 24: విద్యతో పాటు సామాజిక సేవ అవసరమని తారా కళాశాల ప్రిన్సిపాల్ రత్నప్రసాద్ పేర్కొన్నారు. సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో మంగళవారం ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాలలో మొక్కలు నాటారు.

పోషకాహారంతో రక్తహీనతకు చెక్


పుల్‌కల్: గర్భిణులకు సామూహిక సీమంతాలు చేస్తున్న మహిళా సంక్షేమ అధికారులు

పుల్‌కల్, సెప్టెంబరు 24: సమతౌల్య పోషకాహారంతో రక్తహీనతను నివారించవచ్చని జిల్లా పోషణ్ అభియాన్ కో ఆర్డినేటర్ సౌమ్య పేర్కొన్నారు. చౌటకూర్ మండలంలోని కోర్పోలు గ్రామంలో రైతువేదిక భవనంలో మంగళవారం 7వ పోషణ్ అభియాన్ మాసోత్సవంలో భాగంగా నిర్వహించిన అవగాహన సదస్సుకు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ జిల్లా సంక్షేమ అధికారి లలితకుమారి, జోగిపేట ప్రాజెక్టు సీడీపీవో ప్రియాంక హాజరయ్యారు. ఈ సందర్భంగా చిన్న పిల్లలకు అక్షరభ్యాసం, అన్నప్రాసన, గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఆనందమేరీ, జడ్పీహెచ్ఎస్ గెజిటెడ్ హెచ్ఎం అడివప్ప, పీఎస్ హెచ్ఎం రామకృష్ణారెడ్డి, ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు అమృతవాణి, మాజీ ఉప సర్పంచ్ చందాపురం ముకుందంముదిరాజ్, మాజీ వార్డు సభ్యుడు పుట్టి మోహన్‌ముదిరాజ్, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

● నారాయణఖేడ్: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలని జిల్లాసంక్షేమ అధికారిణి లలితకుమారి పేర్కొన్నారు. మంగళవారం ఖేడ్ మున్సిపల్ కార్యాలయంలో పోషణ్ అభియాన్‌లో భాగంగా ఖేడ్, మనూరు మండలాలస్థాయి పోషణ మహోత్సవాన్ని నిర్వహించారు. గర్భిణులకు సీమంతాలు, బాలింతలకు అన్నప్రాసన, చిన్నారులకు అక్షరాభ్యాసం కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఆమె గర్భిణులకు వివిధ అంశాలపై తగిన సూచనలిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, సీడీపీవో సుజాత, ఆయా మండలాల అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీల టీచర్లు, సహాయకులు పాల్గొన్నారు.

చవాన్ బలవంతరావుకు జహీరాబాద్ ఎంపీ నివాళి


బలవంతరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీ సురేష్ షెట్కార్

నారాయణఖేడ్, సెప్టెంబరు 24: మహారాష్ట్రలోని నాందేడ్ ఎంపీ చవాన్ బలవంతరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ మంగళవారం నాందేడ్ జిల్లా నాయగావ్‌లోని ఆయన స్వగృహానికి వెళ్లి బలవంతరావు చిత్రపటానికి పూలమాలలు వేసి అక్కడి నాయకులతో కలిసి నివాళులర్పించారు. కుటుంబీకులను పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా బలవంతరావుతో తనకు గల సాన్నిహిత్యాన్ని గుర్తు చేసుకున్నారు. అనంతరం కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గంలోని డోంగ్లీ గ్రామానికి చెందిన సుశాంత్‌పటేల్ బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్నందున చికిత్స నిమిత్తం సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన రూ.7 లక్షల ఎల్‌వోసీని ఎంపీ సురేష్ షెట్కార్ బాధితుడి కుటుంబీకులకు అందజేశారు. వెంట మాజీ జిల్లా ప్రణాళిక మండలి సభ్యులు నగేష్ షెట్కార్ ఉన్నారు.

డంప్‌యార్డ్ పనులు నిలిపివేయాలి


మెదక్ ఎంపీకి వినతి పత్రాన్ని అందజేస్తున్న అఖిలపక్ష నాయకులు

గుమ్మడిదల, సెప్టెంబరు 24: మండలంలోని నల్లవల్లి గ్రామ పరిధిలో గల ప్యారానగర్‌లో ఏర్పాటు చేయనున్న గ్రేటర్ హైదరాబాద్ జీహెచ్ఎంసీ డంపింగ్ యార్డును తక్షణమే నిలపివేయాలని కోరుతూ మంగళవారం గుమ్మడిదల అఖిలపక్ష నాయకులు ఎంపీ రఘునందన్‌రావుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో డంప్ యార్డు ఏర్పాటు చేయడం వల్ల వాతావరణం పూర్తిగా కలుషితంగా మారుతుందని, తద్వారా రైతులు నష్టపోవడమే కాక మండల ప్రజలు సైతం అనేక ఇబ్బందులు ఎదుర్కొంటారని ఆవేదన వ్యక్తం చేశారు. డంప్ యార్డు ఇక్కడ ఏర్పాటు చేయకుండా తక్షణమే పనులను నిలిపివేయాలని ఎంపీ రఘునందన్ రావుని కోరారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ, కాంగ్రెస్ నాయకుడు కుమార్‌గౌడ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు పలుగు గోవర్ధన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ ప్రభాకర్‌రెడ్డి, మాజీ సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

పొగాకు రహిత సమాజం దిశగా కృషి చేయాలి

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 24: సంగారెడ్డిలోని పలు ప్రాంతాల్లో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో పొగాకు ఉత్పత్తుల వాడకం, అనర్థాలపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ ఆస్పత్రి, జూనియర్ కాలేజ్, పాత బస్టాండ్ తదితర ప్రాంతాల్లో ఫ్లెక్సీ బ్యానర్లతో ర్యాలీ నిర్వహించారు. ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డా.గాయత్రీదేవి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పొగాకు రహిత సమాజం కోసం కృషి చేయాలని సూచించారు. ఎన్‌సీడీ కో ఆర్డినేటర్ ముంతాజ్‌అలీ, లక్ష్మీ, విష్ణువర్ధన్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా


రవిచారిని పరామర్శిస్తున్న నీలం మధు ముదిరాజ్

పటాన్‌చెరు, సెప్టెంబరు 24: బ్రెయిన్ స్ట్రోక్‌తో తీవ్ర అనారోగ్యానికి గురై కోలుకుంటున్న కాంగ్రెస్ కార్యకర్తను ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు నీలం మధు ముదిరాజ్ మంగళవారం పరామర్శించారు. తెల్లాపూర్ న్యూఎంఐజీ కాలనీలో నివాసం ఉండే కాంగ్రెస్ కార్యకర్త, ఎన్ఎంఆర్ యువసేన సభ్యుడు రవిచారి ఇటీవల తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. నీలంమధు అతడి ఇంటికి వెళ్లి అధైర్యపడవద్దని అన్ని విధాలుగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కార్యకర్తలను కాపాడుకునేందుకు ఎంతటి త్యాగానికైనా తాను సిద్ధమన్నారు. నాయకులు ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్, మధుసూధన్, పాండు, భిక్షపతి, మధుపంతులు, అశ్విన్, అక్రమ్, అనిల్ ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను కేంద్రం బృందం సందర్శన

మునిపల్లి, సెప్టెంబరు 24: మండల పరిధిలోని చిన్నచెల్మడ, పెద్దచెల్మడ గ్రామాల అంగన్‌వాడీ కేంద్రాలను జార్ఖండ్, బీహార్ తదితర రాష్ట్రాల ఐసీడీఎస్ శాఖల బృందాల అధికారులు మంగళవారం సందర్శించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులపై ఆరా తీసి సంతృప్తిని వ్యక్త పరిచారు. పిల్లలకు విద్యావిధానం, వ్యక్తిగత క్రమశిక్షణ, ఆట పాటల గురించి అడిగి తెలుసుకున్నారు.

ట్రిబుల్‌ఆర్ రోడ్డు త్రీడీ గెజిట్ విడుదల

నర్సాపూర్, సెప్టెంబరు 24: రీజినల్ రింగు రోడ్డుకు సంబంధించిన 3డీ గెజిట్ విడుదలైనట్లు ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. నర్సాపూర్ డివిజన్ పరిధిలోని 17 గ్రామాల్లో.. ఏ గ్రామంలో ఎంత భూమి, ఎవరి భూమి రోడ్డు కోసం పోనున్నదనే విషయం ఈ గెజిట్‌లో ఉంటుందన్నారు. దీనిని ఆయా పంచాయతీల్లో ప్రచురించనున్నామని, అభ్యంతరాలు ఉంటే తమ దృష్టికి తేవాలని సూచించారు.

వర్షాలతో కంది పంటకు నష్టం: ఏడీఏ

జహీరాబాద్, సెప్టెంబరు 24: ఇటీవల కురిసిన వర్షాభావ ప్రభావంతో కంది పంట పూర్తిగా దెబ్బతిన్నదని వ్యవసాయశాఖ ఏడీఏ భిక్షపతి, శాస్త్రవేత్త విజయ్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని బూర్దిపాడ్, బూచనెల్లి తదితర గ్రామాల్లో వారు రైతుల పంట పొలాలను పరిశీలించి, పలువురు రైతులతో మాట్లాడారు. సెప్టెంబరు మొదటి, రెండువారాల్లో ఎడతెరిపి వర్షాల వల్ల కంది పొలాల్లో నీరు నిల్వ ఉండడం, అవసరం కంటే ఎక్కువగా నేలలో పదును ఉండడంతో ఎండు తెగుళ్ల వ్యాప్తి చెంది పంటలు దెబ్బతిన్నాయన్నారు.

భూసార పరీక్షలపై విద్యార్థులకు అవగాహన

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 24: సంగారెడ్డి మండలం కొత్లాపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జడ్పీహెచ్ఎస్)లో భూసార పరీక్షలపై వ్యవసాయ శాఖ అధికారులు విద్యార్థులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా మట్టి ఆరోగ్యం, నేల తల్లి ప్రాముఖ్యత, మట్టి నమూనా సేకరణ, మట్టి ప్రత్యేకతల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖాధికారి జేడీ.శివప్రసాద్, డాట్ సెంటర్ శాస్త్రవేత్త డా.రాహుల్, డా.వరప్రసాద్, సీనియర్ శాస్త్రవేత్త అంబికాసోని తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ ద్వారా మరిన్ని కార్యక్రమాలు

జహీరాబాద్, సెప్టెంబరు 24: ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మరిన్ని సామాజిక కార్యక్రమాలను చేపడుతున్నామని ఆచార్య కళాశాల ప్రిన్సిపాల్ చింతల హరికుమార్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని ఆచార్య డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో పరిసర ప్రాంతాల గ్రామాల్లో సామాజిక కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. అనంతరం పలువురు విద్యార్థులకు ఎన్ఎస్ఎస్ సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి వెంకట్రాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నందుగౌడ్, దత్తు, అధ్యాపకులు పాల్గొన్నారు.

బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలి

వెల్దుర్తి, సెప్టెంబరు 24: ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలో ఎస్టీటీయూ ఉపాధ్యాయులు బదిలీ అయిన వారిని అదే పాఠశాలలోనే కొనసాగిస్తూ రిలీవ్ చేయడం లేదని, వెంటనే బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలని మంగళవారం ఎస్టీటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరికెల వెంకటేశం పేర్కొన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఎస్టీటీయూ రాష్ట్ర అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశం, నాయకులు కలిసి రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతి పత్రం అందజేశారు. ఇటీవల ఎస్టీటీయూ ఉపాధ్యాయులు బదిలీ అయినప్పటికీ వారిని రిలీవ్ చేయడం లేదని, వెంటనే రిలీవ్ చేయాలని కోరారు.

నల్ల బ్యాడ్జీలతో హాజరు కావాలి

జీవో నం.25ను సవరించేలా చర్యలు తీసుకోవడానికి నేటి నుంచి ప్రతీ ఎస్టీటీయూ ఉపాధ్యాయులు పాఠశాలకు నల్ల బ్యాడ్జీలతో హాజరుకావాలని ఎస్టీటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రధాన వెంకటేశం మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కాంప్లెక్స్ సమావేశాల్లో అందుబాటులో ఉన్న అధికారులకు నిరసన తెలియజేస్తూ మెమోరాండంను అందజేయాలని ఆయన కోరారు.

మోయలేని భారం..



ఓవర్‌లోడ్ ప్రయాణించే వాహనాలపై సరైన పర్యవేక్షణ లేక ఎన్నో ప్రమాదాలు చోటు చేసుకోవడం తెలిసిందే. జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో మంగళవారం ఓ వాహనంలో సామర్థ్యానికి మించి ప్లాస్టిక్‌ను నింపి తరలించడం కనిపించింది. రోడ్డు పక్కన ఇతర వాహన చోదకులకు రోడ్డు సైడ్ కనిపించక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోకపోవడంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.
- ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి

అశ్రద్ధ చేస్తే ఉపేక్షించేది లేదు

● జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి నీలిమ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

శివ్వంపేట, సెప్టెంబరు 24: గిరిజన వసతి గృహం నిర్వహణ అస్తవ్యస్తం అధికారుల పర్యవేక్షణ లోపంతో విద్యార్థులు నాణ్యమైన భోజనం అందడం లేదని ఈ నెల 19 న ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన వార్త కథనానికి జిల్లా అధికారి స్పందించారు.. సోమవారం శివ్వంపేట గిరిజన బాలుర వసతి గృహాన్ని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి వి.నీలిమ సందర్శించి విద్యార్థులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో పని చేయించిన వసతి గృహం సిబ్బందికి మెమో జారీ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నీలిమ మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని పెట్టకుంటే విద్యార్థులపట్ల అశ్రద్ధ వహిస్తే చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు. ఆమె వెంట వసతి గృహం వార్డెన్ యాదయ్య విద్యార్థులు ఉన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎస్జీటీలకు అవకాశం కల్పించాలి

తూప్రాన్, సెప్టెంబరు 24: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎస్జీటీ ఉపాధ్యాయులకు ఓటు అవకాశం కల్పించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) రాష్ట్ర కార్యదర్శి దుబాషి భాస్కర్ డిమాండ్ చేశారు. మంగళవారం తూప్రాన్ మండలం కిష్టాపూర్, ఇస్లాంపూర్, నాగులపల్లి, గుండ్రెడ్డిపల్లి పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన భాస్కర్ మాట్లాడుతూ.. ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలని, 317 జీవో బాధిత ఉద్యోగ, ఉపాధ్యాయులకు న్యాయం చేయాలన్నారు.

● మాసాయిపేట: ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎస్జీటీ ఉపాధ్యాయులకు ఓటు హక్కు కల్పించాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం నాయకులు కర్రె పోచయ్య డిమాండ్ చేశారు. మంగళవారం మాసాయిపేట మండల కేంద్రంలో రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యాప్తంగా సభ్యత్వం నమోదు కార్యక్రమం చురుకుగా సాగుతుందని ఆయన పేర్కొన్నారు.